క్లుప్తంగా

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. ఆయా సమస్యలపై మండల ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

కనుల పండువగా గరుడసేవ



నందిగామటౌన్: పౌర్ణమి సందర్భంగా పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలుమంగా పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారికి ఆదివారం నిర్వహించిన గరుడ సేవ కన్నులపండువగా సాగింది. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పంచామృతాలతో తిరువంజనం, పుష్పార్చన, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై ఆలయ ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్ల మహోత్సవాలు



చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలంలోని చింతలపాడులో వేంచేసియున్న నూకేశ్వరీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా ఆదివారం ముద్రపూలు, గ్రామస్తులు బోనాలు సమర్పించగా, అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. , రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన గ్రామప్రభ ఊరేగింపు నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు : సీఐ



చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలోని చింతలపాడు వేంచేసియున్న నూకేశ్వరీ అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని పటిష్ట పోలీసుబందోబస్తు ఏర్పాటు చేసినట్లు నందిగామ రూరల్ సీఐ చవాన్ తెలిపారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ఆదివారం ఆయన పలు సూచనలు చేశారు. తిరునాళ్లలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. భక్తులు ప్రశాంతవాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు ఇబ్బందులు తలెత్తితే తక్షణమే పోలీసులకు తెలపాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు ఎస్ఐలు దుర్గామహేశ్వరరావు, రాజు, అనిల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత



మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ ఆడిటర్, సమీర ఈస్ట్ లయన్స్ కంటి హాస్పిటల్ ట్రస్ట్ సభ్యుడు పి.సుబ్బారాయుడు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 210 నెలలుగా వయో వృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. డాక్టర్ బి.హనుమయ్య పీవీడీ ప్రసాద్, డి.గోపీనాథ్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



పేటలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆర్యవైశ్య ప్రముఖులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ తదితరులు

నందిగామటౌన్: స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఉద్యమ ఫలితమే ఆంధ్రరాష్ట్ర అవతరణ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో..

రాష్ట్ర అవతరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఉదయభాను పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తంబళ్లపల్లి రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పోలంపల్లి సెంటర్లో ఉన్న శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని నేటి తరాలకు వివరించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రత్యేక ఆహ్వానితులు గుర్రం మోహన్‌రావు, మండల సంఘ అధ్యక్షులు హనుమంతరావు, ప్రధానకార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, గుర్రం రమేష్, వెచ్చా నరసింహారావు, కొత్తా గోవిందరావుగుప్తా, నాగార్జున పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: పొట్టి శ్రీరాములు రాష్ట్ర కోసం చేసిన త్యాగం మరువలేనిదని ఎంపీపీ మార్కపూడి గాంధీ కొనియాడారు. పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎన్నటికీ మరచిపోలేని వ్యక్తి పొట్టిశ్రీరాములు అని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన వారిలో మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు, ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరారావు, నాయకులు ధారా వెంకటేశ్వరరావు, వాసవి క్లబ్ ప్రతినిధులు వంగవేటి ఈశ్వరరావు, పోకూరి రాఘవరావు, వాసవి వనిత క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



వత్సవాయిలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్ర అవతరణకు ప్రాణాలర్పించిన మహనీయుడని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బతి రామకృష్ణ కొనియాడారు. మండలంలోని జుజ్జూరులో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన వారిలో సంఘ నాయకులు తూపగుంట్ల శ్రీనివాసరావు, పమిడిమర్రి జగన్‌మోహనరావు, పబ్బతి రాజా, పబ్బతి విజయశ్రీ, కపిలవాయి పద్మ, పమిడిమర్రి సుబ్బారావు, గ్రామస్తులు ఉన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయిపటేల్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఏఎస్ఐ డి.రమేష్, జల్లి కారల్‌మార్క్స్, బాలస్వామి, పాఠకులు పాల్గొన్నారు.



కంచికచర్లలో నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు రామచంద్రుడు తదితరులు

త్యాగశీలి పొట్టి శ్రీరాములు : తన్నీరు

జగ్గయ్యపేటఅర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర ఆవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి అని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి తన్నీరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ఆశయ సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పార్టీ పట్టణ విభాగం అధ్యక్షుడు వట్టెం మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, రాష్ట్ర ఎస్టీసెల్ నాయకులు బద్దునాయక్, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు కన్నమాల శామ్యూల్, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, బలుసుపాడు సర్పంచ్ సూరిబాబు, నాయకులు ఉపేందర్‌రెడ్డి, చాపల వెంకటేశ్వర్లు, గోగుల వెంకయ్య, గంగోలు వినోద్, కంబాల మల్లయ్య, అమ్మనబోయిన గోపి, బండ్ల మహేష్, మైల హేమంత్, వల్లపుదాసు పవన్, యరమాల చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణత్యాగం చేసిన మహనీయుడు: ఎమ్మెల్యే

ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు ఆశయాల సాధనకు నేటి యువత ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వోద్యోగులకు సన్మానం

కంచికచర్ల: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈనెల 17న జాతీయ పెన్షనర్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి సానె రామ్మోహన్‌రావు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులను సత్కరించనున్నట్లు వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జయంతి(వీరులపాడు): మండలంలోని జయంతి గ్రామంలో ఎస్‌వీఆర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1982లో ఆరునుంచి పదోతరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన గురువులు కుంకులకుంట్ల మల్లయ్య, కొణతం సుబ్బారావు, మలిశెట్టి రోశయ్య, ఇప్పల లక్ష్మారెడ్డి, బొజ్జ మల్లికార్జునరావు, తాడిబోయిన స్వరాజ్యలక్ష్మిలను ఘనంగా సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోటిరెడ్డి, సత్యానారాయణ, పుల్లారావు, భరత్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శృతిలయ సమ్మేళనం రామమూర్తి గాత్రం



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ కళాపీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఎస్.రామమూర్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ వాగ్గేయకారులకు సంకీర్తనా గుడికట్టింది. సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కొమ్మాజొస్యుల సద్గురు చరణ్ వాద్య సహకారం అందించారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సంగీత కచేరీ నిర్వహించిన రామమూర్తి సంగీత సేవలను వివరించారు. వృత్తిరీత్యా చార్టర్ అకౌంటెంట్ అని, చిన్నతనం నుంచే సంగీతంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహించారని వివరించారు. అనంతరం రామూర్తిని ఘనంగా సత్కరించారు.

జాగ్రత్తలు పాటిస్తే.. మిర్చికి మంచి ధర

- వత్సవాయిలో ప్రారంభమైన మిర్చి కోతలు..
- జాగ్రత్తలు పాటించాలంటున్న ఉద్యానవనశాఖ అధికారి



వత్సవాయిలో కల్లంలో పండుకాయలను ఆరబెడుతున్న రైతు

వత్సవాయి: వాణిజ్య పంటల్లో ప్రధానమైనది మిర్చి పంట. రైతులకు లాభాలు తెచ్చిపెట్టినా, నష్టాల పాలు చేసినా మిరప పంటనేనని చెప్పవచ్చు. మిర్చి సాగుకు ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు మొదట్లో అనుకూలించపోవడంతో రైతులు కొద్దీ మేర ఆందోళన చెందారు.అయితే ప్రస్తుతం మిర్చి పంట బాగానే ఉంది. గతేడాది వచ్చిన వైరస్‌ల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ఈసారి విరివిగా మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడులు సైతం పెరిగాయి. ముందుగా నాటిని మిరప తోటలలో మిరపకాయలు కోతకు వచ్చాయి. దీంతో మిర్చిరైతులు కోతలు ప్రారంభించారు.

రూ.10వేలు పలుకుతున్న ధర..

ప్రస్తుతం మార్కెట్లో క్వింటాకు రకాలను బట్టి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతోంది. మిర్చి సాగు చేపట్టడమే కాదు.. పంటకు మంచి ధర లభించేలా రైతులు తగుజాగ్రత్తలు పాటించాలని ఉద్యానవనశాఖాధికారి వర్ధినీకుమారి సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- మిర్చి కోతల ప్రారంభానికి ముందు చేసుకు ఎటువంటి పురుగుమందులను పిచికారీ చేయరాదు. మందులు పిచికారీ చేసిన వారంరోజుల తర్వాతే కోతలు మొదలుపెట్టాలి.
- మిర్చికోతల్లో భాగంగా చెట్టుపై పండిన కాయలను కోసినట్లయితే తాలుకాయలు తగ్గి దిగుబడులు పెరుగుతాయి.
- కోసిన కాయలను మట్టిపై కాకుండా పట్టాలు లేదా సిమెంట్ గచ్చుపై ఎండబెట్టాలి. తద్వారా తొందరగా ఎండిపోవడంతోపాటు కాయ రంగు చెడకుండా ఉంటుంది.
- ఆరబెట్టిన మిరపకాయలపై సాయంత్రం ఆరుగంటల తర్వాత మంచుపడకుండా పట్టాలు కప్పి ఉంచాలి.
- మిరపకాయలు ఎండబెట్టే పరిసరాల్లో కోళ్లు, కుక్కలు రాకుండా చూసుకోవాలి.చెత్తాచెదారం చేరకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- తాలుకాయలు మొత్తాన్ని గ్రేడింగ్ చేయాలి. చిన్న పాటి మచ్చ ఉన్న కాయలను కూడా తొలగించాలి. లేని పక్షంలో మంచికాయలు దెబ్బతినే ప్రమాదం ఉంది.
- కాయలను మార్కెట్‌కు తరలించేటప్పుడు ఉదయం పూట కాయలపై మంచులేకుండా ఉన్న సమయం చూసి తొక్కుడు ప్రారంభించాలి. తేమలేని గోనెసంచులలో మాత్రమే నింపాలి.

ఇలా తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే మిరప కాయలు రంగుచెడకుండా ఉండడంతోపాటు వ్యాపారులు ఎక్కువ ధర పెట్టడానికి ఆసక్తి చూపుతారు. అధికధర ఇస్తామంటూ వచ్చే కొత్తవ్యక్తులను నమ్మి మోసపోవద్దు. లేనిపక్షంలో మార్కెట్‌కు తరలిస్తే రైతులకు వెంటనే నగదు అందుతుందని ఉద్యానవనశాఖ అధికారి వర్ధినీకుమారి సూచించారు.

దీక్షాపరులకు ఇరుముడులు



మక్కపేటలో ఇరుముడులు కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్పదీక్షాపరులు



నందగామలో అయ్యప్పదీక్షాపరులకు ఇరుముడుల కడుతున్న గురుస్వామి

మక్కపేట(వత్సవాయి):గ్రామంలో వేంచేసియున్న శ్రీద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయంలో ఆదివారం దీక్షాస్వాములకు ఇరుముడి కార్యక్రమం వైభవంగా సాగింది. అయ్యప్పదీక్షాపరులు 41రోజుల దీక్షను పూర్తిచేసుకుని ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. గురుస్వాములు లింగాల శేఖర్, కందిమళ్ల రమేష్ ఆధ్వర్యంలో దీక్షాధారులు ఇరుముడులు కట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్త మల్లెల గాంధీ, కన్నెగంటి సత్యనారాయణ, అర్చకులు అత్తలూరి యుగంధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: అయ్యప్ప మాల దీక్షా స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం ఆదివారం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. పలురకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం మండలం రోజుల పాటు దీక్ష చేపట్టిన 50 మంది స్వాములకు గురుస్వాములు అయ్యప్ప శరణు ఘోష నడుమ ఇరుముడులు కట్టారు. ముందుగా రామలింగేశ్వర స్వామి, అయ్యప్ప, గణనాధులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సమయంలో ప్రత్యేక వాహనాలలో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఇరుముడుల కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

తెల్ల వెంకటరెడ్డికి మాజీఎమ్మెల్యే నివాళి



మాజీ సర్పంచి వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

గండేపల్లి(కంచికచర్ల): గండేపల్లి మాజీ సర్పంచి తేళ్ల వెంకటరెడ్డి(86)భౌతికకాయానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటరెడ్డి ఈనెల 13న మృతిచెందగా, ఆయన సంతానం అమెరికా నుంచి స్వగ్రామానికి చేరుకుని అంత్యక్రియలు చేశారు. వెంకటరెడ్డి భౌతికకాయాన్ని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం వెంకటరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తేళ్ల వెంకటరెడ్డి బతికి ఉన్నంతకాలం వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతం కోసం పనిచేశారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని నష్టమని పేర్కొన్నారు. 14ఏళ్లపాటు గండేపల్లి సర్పంచిగా పనిచేసి గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. గ్రామంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కర్మాగారం ఏర్పాటుకు ఎంతగానో కృషిచేశాడని గుర్తుచేశారు. తేళ్ల వెంకటరెడ్డికి నివాళులర్పించిన వారిలో గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్, ఉపసర్పంచి బెల్లంకొండ వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కన్వీనర్ గడుపూడి సత్యనారాయణ, మాజీ సర్పంచులు బొక్కా ప్రభాకరరావు, కృష్ణా వీరనారాయణమ్మ, మాజీ ఉపసర్పంచులు కృష్ణా రంగారావు, సంగం దేవరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు తేళ్ల అంకిరెడ్డి, మట్టా శ్రీనివాసరెడ్డి, నీటిసంఘ మాజీ అధ్యక్షుడు మట్టా చంద్రశేఖరరెడ్డి, నాయకులు సుంకు వెంకటబాలాజీ, బెజవాడ శ్రీహరిరెడ్డి, బెల్లంకొండ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచేది చెస్



పటమట(విజయవాడతూర్పు): కఠినమైన శిక్షణ ఉంటే ఎలాంటి రంగంలోనైనా రాణించవచ్చని, విద్యార్థులకు వినోదంతో పాటు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచే ఆటల్లో చదరంగం ప్రధానమైనదని కేఎస్ఆర్ చెస్ అకాడమీ అధినేత, ప్రముఖ చెస్ కోచ్ సురేష్ అన్నారు. కరెన్సీనగర్‌లోని అకాడమీలో ఇంటర్ స్కూల్స్ చెస్ చాంపియన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో ప్రాచీన ఆటల్లో చెస్ ప్రధానమైనదని, ఇద్దరి మధ్య జరిగే చెస్ పోటీలు వ్యక్తిలో ఏకాగ్రత, చురుకుదనం, వ్యూహం, ఎత్తులకు పైఎత్తులు వేయటంలో రాజసం ఉంటుందన్నారు. ఈ పోటీల్లో 6.5 పాయింట్లతో ఈశ్వర్ మొదటి స్థానం, వి. భువనేశ్వర్ ద్వితీయ స్థానం పొందారు. ఆరు పాయింట్లతో సాయి అమిత్ తృతీయ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నభక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

రచయితలకు సామాజిక స్పృహ ముఖ్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



తిరువూరు: రచయితలు సామాజిక స్పృహతో రచనలు చేయాలని కృష్ణా-గుంటూరు శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఈడే భరతకుమారి రచించిన 'భారతీయం' సరళ పద్యాల శతక పుస్తకాన్ని ఆదివారం స్థానిక సత్యా బీఈడీ కాలేజీ ఆవరణలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి సన్నగిల్లుతోందని, మొబైల్ వాడకంతో చదువుకు సమయం కేటాయించలేకపోవడంతో మంచి రచనలు సైతం వెలుగు చూడడం లేదని చెప్పారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా ఆధునిక సామాజిక పరిస్థితులు, జీవన స్థితిగతులపై రచనలు చేయాలని సూచించారు. సీనియర్ పాత్రికేయుడు కంతేటి చంద్రప్రతాప్ మాట్లాడుతూ చందస్సుతో కూడిన పద్యాల కంటే ప్రజలకు అర్థమయ్యే రీతిలో రచనలు చేయడం మంచిదన్నారు. భరత కుమారి సరికొత్త ప్రయోగాలతో రచనలు చేయడం అభినందనీయమని చెప్పారు. తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, ఎంఈఓ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com